క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: మండల పరిధిలో గొంచాల గ్రామంలో రూ.20 లక్షలతో మేజర్ డ్రైన్ నిర్మాణానికి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శంకుస్థాపన చేశారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన సందర్భంగా ప్రజలు 15 ఏళ్లుగా ఈ డ్రైన్‌తో ఎదుర్కొంటున్న సమస్యను వివరించారని, దీంతో ఈ పనులకు ప్రాధాన్యమిచ్చినట్లు దవులూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, సర్పంచ్ చోడిశెట్టి వెంకట రమణ, వైస్ ఎంపీపీ పేర్నీడి వెంకట్రాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు 'ముద్రగడ' పరామర్శ


కొత్తపల్లిలో గోపాలకృష్ణమూర్తి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముద్రగడ పద్మనాభం

కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లికి చెందిన అదిమళ్ల గోపాలకృష్ణమూర్తి, వాకతిప్పకు చెందిన పాత్రికేయుడు ఓలేటి రాయభ్కారరావు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను గురువారం కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు మాదిరెడ్డి దొరబాబు, నక్క మణికంఠ బాబు తదితరులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

సామర్లకోట: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ కె.శ్రీలలిత గురువారం ఒక ప్రకటలో తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జరిమానా

సామర్లకోట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులకు రూ.10వేలు చొప్పున గురువారం కాకినాడ కోర్టులో న్యాయమూర్తి జరిమానా విధించారని సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాత్రి సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం రాత్రి వేట్లపాలెం గ్రామానికి చెందిన ఉప్పటి లోవరాజు, సర్పవరానికి చెందిన నరేంద్రలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడిపై సమీక్ష

కొత్తపల్లి: కాలువల ద్వారా నీరు రాకపోవడం వల్లే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడిందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంధ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోని నీరు అడుగు భాగానికి చేరుకోవడం వలన సరఫరా చేసే తాగునీరు రంగు మారిందన్నారు. మంచి నీటి పథకానికి పూర్తి స్థాయిలో నీరు రాకపోవడం వలన తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కర్ పాల్గొన్నారు.

వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

శంఖవరం: నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సూక్ష్మ సేద్యం అధికారి జీవీవీ ప్రసాద్‌రావు రైతులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకం (ఏపీఎంఐపీ) ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. బిందు, తుంపర సేద్యం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగిలి ఉన్న సీట్లను రెండో విడత కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించినట్టు జగ్గంపేట ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ గురువారం తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం వద్ద విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన శ్రీరామవేంకట దుర్గా కోలాట మండలి సభ్యులు గురువారం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. 50 మంది సభ్యులు ఆకర్షణీయమైన దుస్తులు ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టి కోలాటం ప్రదర్శించారు.


చెరువుగా మారిన సామర్లకోట జయలక్ష్మి థియేటర్ రోడ్డు


కొత్తపల్లిలో కురుస్తున్న వర్షం

జోరు వాన

- ఉష్ణతాపం నుంచి ఊరట
- ఏకధాటిగా కురిసిన వానలతో
- జలమయమైన రహదారులు
- పొంగి పొర్లిన మురుగు కాలువలు


పెద్దాపురం దర్గా సెంటర్‌లో నీట మునిగిన ప్రధాన రహదారి

పెద్దాపురం: కుండపోత వర్షంతో పెద్దాపురం పట్టణ, గ్రామాల్లోని వీధులు జలమయయ్యాయి. వేసవి తాపం.. రుతుపవనాల రాక మందగించడం తదితర కారణాలతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏకధాటిగా కురిసిన కుండపోత వర్షానికి ఎంతో సేద తీరారు. పట్టణ ప్రాంతంలోని మురికి వాడలు జలమయ్యాయి. రోడ్లన్నీ వర్షపు నీటితో ఏరులై పారడంతో కాలువలోని మురుగు రోడ్లపైకి వచ్చి చెత్తా చెదారం రోడ్లపైనే నిలిచిపోయింది. మున్సిపల్ సెంటర్, కబడ్డీ వీధి, నాయిబ్రాహ్మణ కాలనీ, గోలి వారి వీధి, శివాలయం వీధి, మెయిన్ రోడ్డుతో పాటు పలు మురికి వాడల్లో ప్రజలు ఆ మురుగు నీటిలోనే సంచరించాల్సి వచ్చింది. మరిడమ్మ తల్లి దర్శనానికి వచ్చిన భక్తులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షం

సామర్లకోట: ఎండలతో అల్లాడిన వారికి గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వాన ఊరటనిచ్చింది. రైతులు ఖరీఫ్ పంటలకు ఇప్పటికే సిద్ధమై దమ్ములు చేసుకుంటున్నారు. గురువారం కురిసిన వర్షం రైతులకు ఎంతో మేలు చేయనుంది. ఇప్పటికే దుంప సాగు రైతులు నాట్లు వేసి ప్రస్తుత వర్షానికి సంతోషిస్తున్నారు. వర్షానికి పల్లపు ప్రాంతాల జలమయం అయ్యాయి. బస్సు కాంప్లెక్స్‌తో పాటు జయలక్ష్మి థియేటర్ రోడ్డు, సత్యనారాయణపురం రోడ్డు, గణేష్ కాలనీ, భాస్కర్‌నగర్, సాయినగర్ రోడ్లు చెరువులుగా మారాయి. రోడ్లపై నీరు డ్రైన్లలోకి వెళ్లే అవకాశం లేక స్టేషన్ సెంటర్‌లో రోడ్లు చెరువుగా మారింది. అలాగే వీకే రాయపురంలో కొత్తూరు, గొంచాల, అచ్చంపేట, జి.కొత్తూరు గ్రామాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి వర్షం కురియ డంతో వాతావరణం చల్లబడింది.


సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌లోనికి చేరిన వర్షపు నీరు

కొత్తపల్లి: మండల వ్యాప్తం గురువారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పలు రహదారులపై నీరు నిలిచిపోయింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో జనజీవనం స్తంభించింది. ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్ చెరువులా మారింది. పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో కొత్తపల్లి పోలీసు స్టేషన్ వద్ద నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

పాదాలమ్మకు వైభవంగా బోనాల సమర్పణ


గొల్లప్రోలులో పాదాలమ్మ అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని పాదాలమ్మ అమ్మవారికి గురువారం స్థానికులు బోనాలు సమర్పించారు. 1108 కలశాలతో ముత్తయిదువలు వివిధ రకాల వంటకాలతో కూడిన బోనాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజల చేసి అమ్మవారికి నివేదించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మొగలి అయ్యారావు , పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: పట్టణ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ గురువారం సాయంత్రం ఒక ప్రకటలో తెలిపారు. పట్టణ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించాలన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ గ్రామానికి చెందిన తిగుటి పండు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పిఠాపురానికి చెందని విష్ణు హాస్పటల్ అధినేత పిల్లా శ్రీధర్ గురువారం బాధితుడు పండుకు రూ.8 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన వెంట మత్స్యకార నాయకులు కంబాల దాసు, వెన్నపు చక్రధర్, పల్లెటి బాపన్నదొర, మైలపల్లి రవి తదితరులు ఉన్నారు.

మెట్టలో ఖరీఫ్ ఆలస్యం

- ఇప్పటికీ నమోదుకాని సాధారణ వర్షపాతం
- ఆలస్యమవుతున్న సాగు పనులు

తుని రూరల్: తొలకరి ప్రారంభమై ఆరు వారాలు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు పడడం లేదు. దీంతో మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ సాగు ఆలస్యమవుతోంది. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఒకమోస్తారు వర్షాలే కురిశాయి. వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్‌లో అధికశాతం రైతులు వర్షాధారంగానే సాగు చేస్తున్నారు. ఏలేరు, పంపా, తాండవ రిజర్వాయర్లతో పాటు పుష్కర, పీబీసీ జలాలు కొన్ని గ్రామాల పరిధిలో భూములకు చేరుతాయి. సబ్‌డివిజన్ పరిధిలో తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో 76 వేల ఎకరాల సాగు భూములు ఉన్నాయి. ఇందులో 32 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరిసాగు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన శాశ్వత నీటి వసతులు లేకపోవడంతో ఎక్కువ మంది రైతులు వర్షాధారంపై ఆధారపడుతున్నారు.

చెరువుల్లో కానరాని జలకళ

జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ మొదలయినప్పటికీ ఆశించిన స్థాయిలో తొలకరి వర్షాలు కురవలేదు. సాగునీటి చెరువులు నిండలేదు. తుని మండలంలోనే 75 చెరువులు ఉండగా 60 చెరువుల్లో కనిష్టస్థాయిలో జలాలు లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తుని, కోటనదూరు, రౌతులపూడి మండలాల్లో సాధారణ వర్షపాతాలు నమోదు కాలేదు. శంఖవరం మండలంలో అత్యల్పంగా వర్షపాతం నమోదైంది. తొండంగి మండలంలో సాధారణ వర్షపాతం 169.8 కాగా వర్షపాతం 175.4 ఎంఎంగా నమోదయ్యాయి.


వి.కొత్తూరు గ్రామ పరిధిలో నాట్లు వేయని సాగు భూములు

రేపటి నుంచి నీటి విడుదల

ఈ నెల 15 నుంచి పంపా రిజర్వాయర్ నుంచి 25 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు ఆయకట్టు రైతుల సమావేశంలో ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. 103 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల పంపాలో 99.20 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. ఈ నీటి నిల్వలు ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సరిపోవు. వర్షాలు కురవకపోతే పుష్కర నీళ్లనైన పంపాకు మళ్లించాల్సి ఉంది. తాండవ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 380 అడుగులు. ప్రస్తుతం 369 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. ఆయకట్టుకు నిరంతరంగా విడుదల చేస్తే 40 రోజుల వరకు నీరు అందించగలమని అధికారులు పేర్కొన్నారు.

సురక్షతో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గ్రామాల్లో ఉత్సాహంగా 'జగనన్న సురక్ష'


పిఠాపురంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు


జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న దొరబాబు, జెడ్పీటీసీ తదితరులు

పిఠాపురం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఇకపై అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారు ఉండరని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మున్సిపాలిటీ 9వ సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత సంక్షేమం పరుగులు పెట్టిందన్నారు. వివిధ కారణాల వల్ల కొందరికి ప్రభుత్వ పథకాలు అందడం లేదని జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతులు వచ్చాయన్నారు. ఈ మేరకు అర్హులకు కచ్చితంగా పథకాలు అందేలా చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలు జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గోరింట గ్రామంలో సర్పంచ్ పచ్చిపాల మేరీకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సర్టిఫికెట్లను దరఖాస్తుదారులకు అందజేశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఈఓ పీఆర్డీ మూర్తి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, పార్టీ నాయకులు బర్రే రామగోవిందు, చీమల చినబాబు, నాగేశ్వరరావు, వాసిరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ శైల గణేష్, సుందరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


వేట్లపాలెంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు


కొమరగిరిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

వేట్లపాలెంలో..

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దరఖాస్తుదారులకు వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈఓ పీఆర్డీ కె.హరికృష్ణ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోషే, వీఆర్వో కేవీవీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని సర్పంచ్ కందేపల్లి సత్యశ్రీ అన్నారు. మండలంలోని కొమరగిరి సచివాలయం-2 వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు సర్పంచ్ సత్యశ్రీ, అధికారులు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఈఓపీఆర్డీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి వారిజ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

దివ్యాంగ సర్టిఫికెట్ అందజేసి..

ఈ ఫొటోలో రెండు కాళ్లు పోగొట్టుకున్న బాధితుడు యడగల అబ్రహం. ఇంటి వద్దకే ఏఎన్ఎంతో వచ్చిన వలంటీరు శ్యామల సదరమ్ సర్టిఫికేట్ అందజేశారు. ఇటీవల సామర్లకోట బలుసులపేటలో ఒక చర్చి మరమ్మతులు సమయంలో జరిగిన ప్రమాదంలో అతడు గాయపడి రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. దీనిని గమనించిన శ్యామల అతనికి మరో వలంటీర్ పిట్టా పావని ద్వారా దివ్యాంగ సర్టిఫికెట్ ఇప్పిస్తే దాని ద్వారా దివ్యాంగ పింఛను ఇప్పించవచ్చని ఆలోచించింది. సచివాలయంలోని పావనిని బాధితుని వద్దకు తీసుకువచ్చి సదరమ్ సర్టిఫికెట్ ఇప్పించి దివ్యాంగ ఫించన్ మంజూరు చేయించింది. కొత్త పింఛన్లు విడుదల అయిన వెంటనే బాధితునకు దివ్యాంగ పింఛను రూ.మూడు వేలు వచ్చే అవకాశం ఉంది.


అబ్రహం ఇంటికి వచ్చి సదరమ్ సర్టిఫికెట్ అందజేస్తున్న వలంటీర్, ఏఎన్ఎంలు

అడగకుండానే సర్టిఫికెట్ అందింది



"ఇటీవల జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లు తీసి వేశారు. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని బాధపడుతుండగా వలంటీర్ శ్యామల సదరమ్ సర్టిఫికెట్ ఇప్పించారు. దాని ద్వారా ఆమె దివ్యాంగ పింఛను మంజూరు చేయించి ఎంతో సాయం చేసింది. పింఛను వస్తుందనే భరోసా ఉంది."

– యడగల అబ్రహం, బలుసులపేట, సామర్లకోట.

కరోనాకు భయపడకుండా..

ఇతని పేరు ఎదు అప్పలరాజు. వాకతిప్పలో గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతను ప్రతి నెలా ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందిస్తాడు. గతంలో కరోనా మహమ్మారి వ్యాపించిన సమయంలో ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉండేది. ఆ సమయంలో అప్పలరాజు కరోనాను సైతం లెక్కచేయకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సేవలు అందించాడు. ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారికి అవసరమైతే మందులు అందించాడు.


కరోనా సమయంలో ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్ అప్పలరాజు

తల్లిదండ్రులు తలెత్తుకునేలా..!

- ట్రిపుల్ ఐటీకి సర్కారీ స్కూళ్ల విద్యార్థుల ఎంపిక
- ప్రభుత్వ ప్రోత్సాహంతో మెరుగైన ఫలితాలు


తలాటం లక్ష్మి | ఎస్.గణేష్ | పాలికి క్రాంతిదీపిక | కొంతం ఆదిలక్ష్మి | జి.లీలాప్రసన్న గౌరి


వెంకట మంగాదేవి | మణికంఠ సుబ్రహ్మణ్య స్వామి | జి.సాయి రస్వంత్ | ఎం. వసంత ప్రమీల | వై.యమునశ్రీ | జి. సత్యతేజశ్రీ

పిఠాపురం: పిల్లలు పుట్టినప్పుడు కాదు వారు ప్రయోజకులైనప్పుడే తల్లిదండ్రులకు నిజమైన ఆనందం. చదువు ఒకరి సొత్తు కాదని సత్తా ఉంటే సాధించలేనిది లేదని ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో పలువురు పేద విద్యార్థులు నిరూపించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన గుండ్ర లీలా ప్రసన్న గౌరి, గొల్లపల్లి అమని వెంకట మంగాదేవి, ఇంటి మణికంఠ సుబ్రహ్మణ్య స్వామి, జ్యోతుల సాయి రస్వంత్, తాటిపర్తి హైస్కూల్‌కు చెందిన మేలేటి వసంత ప్రమీల, గొల్లప్రోలు నగర పంచాయతీ హైస్కూల్ నుంచి యర్రంశెట్టి యమునశ్రీ, గొల్లపల్లి సత్యతేజశ్రీ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరందరికీ శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలులోని ట్రిపుల్ ఐటీ కాలేజీల్లో సీట్లు కేటాయించారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు అభినందించారు.

సామర్లకోటలో నలుగురి ఎంపిక

సామర్లకోట: ఆయా రిజర్వేషన్ల కేటగిరీలకు సంబంధించి మండల పరిధిలో నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ వై.శివ రామకృష్ణయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చంద్రపాలెం శివారు ఉప్పగూడెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన తలాటం లక్ష్మి, సామర్లకోట బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన ఎస్.గణేష్, వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పాలికి క్రాంతిదీపిక, కొంతం ఆదిలక్ష్మి ట్రిబుల్ ఐటీకి ఎంపికై నట్టు వివరించారు.

కౌలురైతు కుమార్తె ఎంపిక

మండల పరిధిలో కౌలు రైతు తలాటం రామకృష్ణ కుమార్తె తలాటం లక్ష్మి ట్రిబుల్ ఐటీకి ఎంపిక అయింది. ఆమె తల్లి వెంకటలక్ష్మి గృహిణి. కుమార్తెను గురువారం తల్లిదండ్రులు అభినందించారు.

ముగిసిన సాగర్ కవచ్

కొత్తపల్లి: తీర ప్రాంతంలో పోలీసులు నిర్వహిస్తున్న సాగర్‌కవచ్ గురువారంతో ముగిసినట్లు ఎస్సై రామలింగేశ్వరరావు తెలిపారు. ఉగ్రవాదులు తీరంలో ప్రవేశిస్తే వారిని గుర్తించి పట్టుకోవడం కోసం ఉప్పాడ శివారు ఎస్‌పీజీఎల్ నుంచి పొన్నాడ శివారు కోనపాపేట వరకూ పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 34 మంది పోలీసులు రెండు రోజుల పాటు గస్తి నిర్వహించారు. తీర ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. తీర ప్రాంతంలో ఉన్న గ్రామస్తులు, వేటకు వెళ్లే మత్స్యకారులకు ఎవరైనా అనుమానిత వ్యక్తులు, బోట్లు కనిపించిన మెరైన్, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

గర్భిణులకు మెరుగైన సేవలందించాలి

కోటనందూరు: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందించాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. టీజే నగరం అంగన్‌వాడీ కార్యకర్తగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చిటికెల శ్రావణి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో విధినిర్వహణలో మంచి సేవలందిస్తానన్నారు. సర్పంచ్ సుర్ల రాంబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్దిర్సి రమేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ క్రాంతి పథం ఇన్‌చార్జి ఏపీఎంగా సూర్యకుమారి

రౌతులపూడి: మండల వైఎస్సార్ క్రాంతి పథం ఇన్‌చార్జ్ ఏపీఎంగా సూర్యకుమారి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రస్తుతం కోటనందూరు ఏపీఎంగా కొనసాగుతున్నారు. డీఆర్‌డీఏ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌతులపూడి ఇన్‌చార్జ్ ఏపీఎంగా బాధ్యతలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన సరస్వతి ఇక నుంచి సీసీగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు కృషిచేస్తానన్నారు. బ్యాంకు రుణాలు, శ్రీనిధి, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, వెలుగు రుణాలను రికవరీ చేసి సంఘాల ఆర్థికాభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

పాముకాటుకు గురై వ్యక్తి మృతి

తొండంగి: పాము కాటుకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై ఎస్.రవికుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన మేడిశెట్టి సత్యనారాయణను బుధవారం తన ఇంటి ప్రాంగణంలో పాము కరిచింది. అతడిని కుటుంబ సభ్యులు సమీపంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీనిపై మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవికుమార్ వివరించారు.